సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 7 । జూలై । 2024




కద్తాల్: మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇరుకు గదిలో నేలపై కూర్చుని..



షాబాద్: బీసీ బాలుర వసతి హాస్టల్ పక్కనే పేరుకుపోయిన చెత్త

సం'క్షామ' హాస్టళ్లు



ఆమనగల్లు: తలుపులు లేని స్నానాలగది

సర్కారు వసతి గృహాల్లో సంక్షేమం కొరవడింది. సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. శిథిల భవనాలు.. తలుపులు లేని గదులు.. కంపుకొట్టే మరుగుదొడ్లు.. అరకొర సౌకర్యాలు.. అపరిశుభ్రవాతావరణం మధ్య ఇరుకు గదుల్లో విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. కొన్ని చోట్ల వర్షం వస్తే గదులు ఉరుస్తున్నాయి. తాగునీటికి సైతం ఇబ్బంది పడాల్సి వస్తోంది. శనివారం జిల్లాలోని పలు హాస్టళ్లను 'సాక్షి' విజిట్ చేయగా విద్యార్థుల అవస్థలు వెలుగు చూశాయి. మిగతా 8లో▸

సాక్షి విజిట్



కొందుర్గు: ఎస్సీ వసతి గృహంలో బాత్‌రూమ్‌ల పక్కనే నిలిచిన మురుగునీరు



చేవెళ్ల: ఎస్సీ బాలుర గృహంలో మరుగుదొడ్ల పరిస్థితి



మంచాల: ఆరుట్ల ఎస్సీ వసతి గృహంలో వర్షాలకు కురుస్తున్న గది

న్యూస్‌రీల్

వర్షాకాలం బంకుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్



ఓ బంకులో డీజిల్, పెట్రోల్‌ను పరిశీలిస్తున్న రఘునందన్

తుర్కయంజాల్: వర్షాకాలంలో పెట్రోల్ బంకుల యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. తుర్కయంజాల్‌లోని పలు పెట్రోల్ బంక్‌లను శనివారం ఆయన పరిశీలించారు. బంకుల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనుభవం ఉన్నటువంటి డీలర్లు, మేనేజర్లు పట్టించుకోకుండా సేల్స్ బాయ్స్‌కు వదిలేయడంతో సమస్యలు వస్తున్నాయని, ఇందుకు నిదర్శనం శుక్రవారం మన్నెగూడలో చోటుచేసుకున్న సంఘటనే అని పేర్కొన్నారు. నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వినియోగదారుల నుంచి ఇటీవల వరుసగా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. నిర్వాహకుల తప్పు ఉన్నట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంత్రులను కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాలె యాదయ్య

చేవెళ్ల: రాష్ట్ర మంత్రులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన శనివారం నగరంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

దోపిడీ లేని సమాజ నిర్మాణమే లక్ష్యం



మాట్లాడుతున్న రాములు

ఇబ్రహీంపట్నం రూరల్: దోపిడీ లేని సమాజ నిర్మాణమే లక్ష్యమని సీపీఎం సీనియర్ నాయకుడు, తెలంగాణ ప్రత్యామ్నాయ సాంస్కృతిక కేంద్రం కన్వీనర్ జి.రాములు పేర్కొన్నారు. పార్టీ మండల రాజకీయ శిక్షణ తరగతులు మండల కార్యదర్శి చాతాళ్ల జంగయ్య ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో భూస్వామ్య వ్యవస్థ లేకపోయినా రూపం మారిందన్నారు. దోపిడీ పెట్టుబడిదారులకు లాభాలు కొనసాగుతున్నాయని అన్నారు. దేశంలోని 60 శాతం సంపద కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమైందన్నారు. ఆ సంపద పేదల చేతుల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. పాలక పక్షాలు పేదల పక్షాన కాకుండా పెద్దల పక్షాన నిలుస్తున్నాయని దుయ్యబట్టారు. దీనికి వ్యతిరేకంగా సాంస్కృతిక, సామాజిక ఉద్యమాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపైనే ఉందన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా ఉద్యమాలు చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సామేలు, జిల్లా కమిటీ సభ్యుడు అలంపల్లి నర్సింహ, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పాల్గొన్నారు.

బోనమెత్తుదాం



నేటి నుంచి కోట బోనాలు

• భారీ ఎత్తున ఏర్పాట్లు • ముస్తాబైన అమ్మవార్లు

గోల్కొండ: బోనాలకు వేళైంది. గోల్కొండ కోట ముస్తాబైంది. కోటలో కొలువుదీరిన శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢమాసం బోనాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం తొమ్మిది పూజలు అందుకునే అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం జలమండలి భారీ ఎత్తున తాగునీటి ఏర్పాట్లు చేస్తోంది. జలమండలి డీజీఎం ఖాజా జవహర్ అలీ సిబ్బందితో తాగునీటి ట్యాంకర్లను పెట్టిస్తున్నారు. మరోవైపు ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేకంగా హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమయ్యే అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచారు. అగ్నిమాపక శాఖ వారు మొబైల్ ఫైర్ ఎస్టింగిషర్‌ను రెడీ చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అమ్మవారి అలంకరణను పూర్తి చేశారు. పోలీసులు లంగర్‌హౌజ్ నుంచి గోల్కొండ వరకు పికెటింగ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు మహిళా పోలీస్ టీమ్‌లను సిద్ధంగా ఉంచారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు.



ముస్తాబైన మహంకాళి అమ్మవారు

సప్త మాతృకలకు.. బంగారు బోనాలు..



బంగారు బోనం పాత్ర

చార్మినార్: నగరంలో ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడలోని కనక దుర్గ అమ్మవారికి బోనాలను సమర్పించనున్నారు. ఇందులో భాగంగా మొదటి బంగారు బోనాన్ని గోల్కొండ జగదాంబ అమ్మవారికి సమర్పించనున్నామని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పాతబస్తీ మీరాలంమండి మహంకాళేశ్వర దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బోనంతో గోల్కొండ కోటకు బయలుదేరుతామన్నారు. లంగర్‌హౌజ్ వద్ద ఏర్పాటు చేసే స్వాగత వేదికపై నుంచి మంత్రులు స్వాగతం పలుకుతారని ఆయన తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో సప్త మాతృకలకు సప్త బంగారు బోనాలను నగరంలోని గోల్కొండ, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ తల్లి, జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయం, చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం, లాల్‌దర్వాజా సింహవాహిని దేవాలయం అమ్మవార్లకు బంగారు పాత్రలో సమర్పించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం గోల్కొండ జగదాంబ అమ్మవారికి, 10న బల్కంపేట ఎల్లమ్మ, 12న, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి, 14న విజయవాడ కనకదుర్గ అమ్మవారికి, 18న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి, 23న చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి, 25న లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవార్లకు బంగారు బోనం, పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించనున్నారు.

నగరంలో బోనాలు ఇలా..

వివరాలు 10లో▸

స్టూడెంట్స్‌కు 'ఇన్‌స్పైర్'

జాతీయ స్థాయిలో 'ఇన్‌స్పైర్ మనక్'

- విద్యార్థుల ఆవిష్కరణలకు ఆహ్వానం
- ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ప్రతిభ చూపినవారికి నగదు పురస్కారాలు

కేశంపేట: రాష్ట్రపతి భవన్‌లో అతిథ్యం.. దేశ ప్రథమ పౌరుడితో అభినందనలు.. కేంద్ర మంత్రులతో ప్రశంసలు.. దేశ దిగ్గజ శాస్త్రవేత్తలతో సమాలోచనలు.. ఇలాంటి అరుదైన అవకాశం వస్తుందంటే ఎవరు మాత్రం కాదంటారు.. కానీ అందుకోసం విద్యార్థులు కాస్త కష్టపడాలి.. తమ తెలివికి పదును పెట్టాలి.

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులు

పాఠశాల స్థాయి నుండే విద్యార్థులను ప్రయోగాల వైపు నడిపించి, వారిలో వినూత్న ఆలోచనలకు పదును పెట్టి భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ద్వార 'ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్సూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్' (ఇన్‌స్పైర్) పేరుతో ఇన్‌స్పైర్ మనక్ అవార్డులను అందిస్తోంది. 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు కలిగి 6 నుంచి 10వ తరగతి చదివే ప్రతిభ కలిగిన విద్యార్థుల నుంచి 2024–25 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు స్వీకరిస్తున్నారు. దేశ వ్యాప్తంగా మిలియన్ విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలకు పదును పెట్టడమే ఇన్‌స్పైర్ మనక్ లక్ష్యం.

ఎవరు అర్హులంటే..

ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల, మోడల్ స్కూల్స్, కేజీబీవీ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు అర్హులు. వీరు పాఠశాలలోని సైన్స్ ఉపాధ్యాయుడి గైడ్‌లైన్స్ పాటిస్తూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఎప్పటిలోగా అంటే..

విద్యార్థులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 15 వరకు కేంద్ర ప్రభుత్వం గడువు విధించింది. విద్యార్థులు తాము చదువుతున్న పాఠశాల నుంచి సైన్స్ ఉపాధ్యాయులతో కలిసి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.

గత విద్యా సంవత్సరంలో..

2023–24 విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయికి 92 నామినేషన్లు ఎంపికయ్యాయి. వీటిలో ప్రతిభ కనబర్చిన 8 నామినేషన్లు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. ఈ విద్యా సంవత్సరం జాతీయ స్థాయిలో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటేలా సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

దరఖాస్తు చేసుకునే విధానం

- ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లో వెళ్లి న్యూ రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఎంచుకోవాలి.
- పాఠశాలకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకొని, సేవ్ చేసుకోవాలి. ఈ దరఖాస్తు జిల్లా అథారిటీకి వెళ్తుంది.
- వీరు ఆమోదిస్తే విద్యార్థికి సంబంధించి పొందుపర్చిన మెయిల్ ఐడీకి యూజర్ ఐడీతో కూడిన లింక్ వస్తుంది.
- అప్పుడు విద్యార్థులు యూజర్ ఐడీకి పాస్‌వర్డును క్రియేట్ చేసుకోవాల్సి ఉంటుంది.
- విద్యార్థి తన సమాచారంతో పాటు బ్యాంక్ అకౌంట్ నంబర్, ఆధార్ నంబర్ నమోదు చేయాల్సి ఉంటుంది.
- విద్యార్థి ప్రదర్శించాలనుకున్న ప్రాజెక్టును సంక్షిప్తంగా వెబ్‌సైట్లో నమోదు చేయాలి.
- ఎంపికైన ప్రాజెక్టు ప్రయోగ నిమిత్తం విద్యార్థి బ్యాంక్ ఖాతాకు రూ.పదివేలు జమ చేస్తారు.
- రాష్ట్ర స్థాయికి ప్రాజెక్టు ఎంపికైతే రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు అందిస్తారు.
- ఆన్‌లైన్‌లో ఉచితంగా విద్యార్థులు పేర్లు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.

సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులు తమలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇన్‌స్పైర్ ఎంతగానో దోహదపడుతుంది. ఉపాధ్యాయుల సహకారంతో పోటీల్లో పాల్గొని సత్తా చాటాలి. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొనే విధంగా సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలి.

– వై.శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి

పెండింగ్ బిల్లులపై అసెంబ్లీలో ప్రస్తావించండి

బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం నాయకుల విజ్ఞప్తి



మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన సర్పంచ్‌ల సంఘం నాయకులు

కడ్తాల్: పంచాయతీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే అందించేలా కృషి చేయాలని, అవసరమైతే వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో వీటిపై చర్చించి న్యాయం చేయాలని బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సంఘం నాయకులు మహేశ్వర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి పంచాయతీల సమస్యలను వివరించారు. రాష్ట్రంలో 2019–24 సంవత్సరాల మధ్య కాలంలో సర్పంచ్‌లుగా కొనసాగి, అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం నుంచి సరైన సమయంలో నిధులు అందకపోయినా సొంత డబ్బులు వెచ్చించినట్టు చెప్పారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ఐదు నెలలు గడిచినా పెండింగ్ బిల్లులు అందలేదన్నారు. అభివృద్ధి పనులకు అప్పులు చేసి ఖర్చు పెట్టిన సర్పంచ్‌లకు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకున్నారని.. ఈ విషయాన్ని అధికారులు, ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని అన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో పెండింగ్ బిల్లులపై చర్చించి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు సుర్వీ యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ



విజేతలకు బహుమతుల ప్రదానం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 10వ రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్–19) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఉత్సాహంగా ముగిసింది. చివరి రోజు శనివారం ఆయా విభాగాల ఫైనల్స్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. సింగిల్స్ విభాగంలో ఎం.అజయ్‌కార్తీక్ (జనగాం), ప్రసన్నబోనం (ఖమ్మం) సత్తా చాటి చాంపియన్లుగా నిలిచారు. బాలుర విభాగం ఫైనల్‌లో అజయ్‌కార్తీక్ 21–16, 21–26 వరుస సెట్ల తేడాతో అక్షిత్ వలిశెట్టి (మెదక్)పై విజయం సాధించగా.. బాలికల మ్యాచ్‌లో ప్రసన్న బోనం 21–12, 23–21 తేడాతో శ్రేష్టారెడ్డి (హైదరాబాద్)పై గెలుపొందింది.

హోరాహోరీగా డబుల్స్ మ్యాచ్‌లు..

డబుల్స్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. బాలుర మ్యాచ్‌లో ఎం.నవనీత్ (రంగారెడ్డి)– వెంకట మానిష్ (మెదక్) 22–24, 22–20, 22–20 తేడాతో అక్షిత్ వలిశెట్టి (మెదక్)– పులపాటి జైనేష్‌రెడ్డి (హైదరాబాద్)పై విజయం సాధించారు. బాలికల మ్యాచ్‌లో అలీషాఖాన్ (రంగారెడ్డి) – శ్రేష్టారెడ్డి (హైదరాబాద్) 21–16, 21–11 తేడాతో కె.సమీక్షారెడ్డి (హైదరాబాద్)– పూజిత నీలికంఠి (రంగారెడ్డి)పై గెలుపొంది విజేతగా నిలిచారు.

- మిక్స్‌డ్ డబుల్స్ విభాగం ఫైనల్‌లో అన్నాచెల్లెలు ఎం.అజయ్‌కార్తీక్ – ఎం.కీర్తి (జనగాం) 14–21, 21–16, 21–14 తేడాతో ఇంటూరి వర్షిత్ శ్రీసాయి (భద్రాద్రి కొత్తగూడెం)– అలీషాఖాన్(రంగారెడ్డి)పై గెలుపొంది టైటిల్ సాధించారు. టోర్నీ ముగింపు వేడుకల్లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని విజేతలకు ట్రోఫీలను అందజేశారు.

హామీలు అమలు చేయకుండా కాలయాపన

కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

మహేశ్వరం: రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి కాలయాపన చేస్తున్నారని కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగారం గ్రామంలోని కుండె వెంకటేశ్ వ్యవసాయ క్షేత్రంలో శనివారం కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుల పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. కౌలు రైతుల సంక్షేమం కోసం పని చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు పోరాడాలన్నారు. ఈ నెల 8,9 తేదీల్లో కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయాల ఎదుట రైతు సత్యాగ్రహ దీక్షలు చేపట్టనున్నట్టు ఆయన వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు, రైతులను భాగస్వాములను చేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి, బస్వ పాపయ్య గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మారిపల్లి అంజయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

యువకుడి అదృశ్యం


స్వామి (ఫైల్)

పహాడీషరీఫ్: యువకుడు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మల్లేశ్వర స్వామి (28) ఏడాది నుంచి జల్‌పల్లిలోని మంచు టౌన్‌షిప్ సమీపంలోని ఓ వెంచర్‌లో సైట్ ఇన్‌ఛార్జిగా పని చేస్తూ, అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ నెల 3వ తేదీ నుంచి స్వామి కనిపించకపోవడంతో అతని సోదరుడు ప్రసాద్ వెతికాడు. ఫలితం లేకుండా పోయింది. దీంతో శనివారం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

భర్తతో గొడవపడి..


సుహాసిని (ఫైల్)

చేవెళ్ల: భర్తతో గొడవ పడి అమ్మగారి ఇంటికి వెళ్లిన మహిళ కనిపించకుండా పోయింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండాల అనుబంధ గ్రామం సాయిరెడ్డిగూడలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి సాయిరెడ్డిగూడ గ్రామానికి చెందిన సుహాసిని(28)ని జీడిమెట్ల షాపూర్‌నగర్‌కు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె మే నెలలో అమ్మగారి ఊరు గుండాల గ్రామానికి వెళ్లింది. అప్పట్లోనే భర్త వచ్చి తీసుకెళ్తానని చెప్పినా వెళ్ల లేదు. ఆ తరువాత మే 26న కనిపించకుండా పోయింది. వెతికినా ఆచూకీ తెలియలేదు. తల్లి స్వరూప శనివారం పోలీసులు ఫిర్యాదు చేయగా.. కేసు దర్యాప్తు చేపట్టారు.

లోఓల్టేజీతో కాలిపోతున్న ఎలక్ట్రానిక్ పరికరాలు

మొయినాబాద్: మండల పరిధి శ్రీరాంనగర్‌లో లోఓల్టేజీ సమస్య తీవ్రమయింది. తరచూ ఇళ్లలోని ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయి. తాజాగా శనివారం మధ్యాహ్నం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పెద్ద శబ్దం రావడంతో పలువురి ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు ధ్వంసమయ్యాయి. సమస్య తీర్చాలని విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని.. వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు.

సెల్‌ఫోన్ కొట్టేసి.. ఫోన్‌పే ద్వారా రూ.75వేలు కాజేసి

మొయినాబాద్: లారీ క్యాబిన్‌లో నిద్రిస్తున్న డ్రైవర్ నుంచి గుర్తుతెలియని దుండగులు సెల్‌ఫోన్ కొట్టేసి, ఫోన్‌పే ద్వారా అతని ఖాతా నుంచి రూ.75 వేలు కాజేశారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం కౌడీడ్ గ్రామానికి చెందిన అబ్దుల్ నబీ సిమెంట్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 4న సిమెంటు లోడు కోసం హైదరాబాద్ నుంచి తాండూరులోని సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్లాడు. సరకుతో శుక్రవారం తెల్లవారు జాము 4.30 గంటలకు మండల పరిధి అజీజ్‌నగర్ చౌరస్తా వద్దకు చేరుకున్నాడు. నిద్ర రావడంతో నబీ లారీని రోడ్డు పక్కన నిలిపి క్యాబిన్‌లో నిద్రపోయాడు. ఉదయం 7.40 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి లారీ క్యాబిన్‌లోకి చొరబడి డ్రైవర్ సెల్‌ఫోన్‌ను చోరీ చేశాడు. అలికిడి రావడంతో మేలుకున్న డ్రైవర్.. గట్టిగా అరవడంతో.. అప్పటికే మరో వ్యక్తి బైక్‌పై రెడీగా ఉండటంతో ఇద్దరు కలిసి పారిపోయారు. డబ్బులు పోయినట్లు గుర్తించిన డ్రైవర్ తన ఖాతాను ఫ్రీజ్ చేయించాడు. అనంతరం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అండర్‌పాస్ కింద నీటిలో చిక్కుకున్న కారు

ఇతరుల సాయంతో తప్పిన ప్రమాదం

కొత్తూరు: కొత్తూరు పట్టణంలోని వై జంక్షన్ కూడలి సమీపంలో నిర్మించిన అండర్‌పాస్ శనివారం కురిసిన వర్షానికి అండర్‌పాస్ కిందకు భారీగా వరద నీరు చేరింది. ఈ క్రమంలో తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీశైలం తనకారులో వరద నీటిని అంచనా వేయకుండా వెళ్లగా.. కారు నీటిలో చిక్కుకుంది. డోర్లు తెరచుకోకపోవడంతో కార్యాలయ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. అక్కడకు చేరుకున్న సిబ్బంది, స్థానికుల సహాయంతో డోరు తెరవడంతో ఆయన బయటకు వచ్చారు. అనంతరం కారును నీటిలోంచి తీశారు.

సం'క్షామ' హాస్టళ్లు


చేవెళ్ల: ఎస్సీ బాలుర వసతిగృహం


గృహంలో ఒకే గదిలో ఐదు మంచాలు

సర్కారు వసతి గృహాల్లో సంక్షేమం కొరవడింది. శిథిల భవనాలు, వర్షం కురిస్తే గదుల్లో నీరు చేరుతాయి. తలుపు లేని మరుగుదొడ్లు, నీరు లేని స్నానాల గదులు ఇలా ఒక్కటేమిటి.. అనేక సమస్యలు హాస్టళ్లలో తిష్టవేశాయి. ప్రభుత్వాలు మారుతున్నా గృహాల సమస్యలు పట్టించుకునే వారు కనిపించడం లేదని, చదువుపై ఉన్న మమకారంతో బిక్కుబిక్కుమంటూ కాలమెల్లదీస్తున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిగి, వికారాబాద్ హాస్టళ్లలో పలు కారణాలతో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో శనివారం జిల్లాలోని పలు హాస్టళ్లను 'సాక్షి' విజిట్ చేయగా వెలుగు చూసిన సమస్యలపై కథనం..

- అసౌకర్యాలకు నిలయంగా వసతి గృహాలు
- వేధిస్తున్న అపరిశుభ్రత
- పెరిగిన దోమలు, ఈగల బెడద
- ఐదే గదులు.. 65 మంది విద్యార్థులు
- తాగునీటి కటకట.. బోరునీళ్లతో సరిపెట్టుకుంటున్న విద్యార్థులు

సాక్షి విజిట్

చేవెళ్ల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహంలో 65 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి సరిపడా గదులు లేవు. మొత్తం ఆరు గదులు ఉండగా.. వీటిలో ఒక్కటి స్టోర్ రూమ్‌కు ఉపయోగించారు. ఐదే వినియోగంలో ఉన్నాయి. దీంతో ఒక్క గదిలో ఒక్కో మంచానికి ఇద్దరు చొప్పున ఐదు మంచాలు ఉండాలి. కానీ.. నలుగురు చొప్పున ఒకగదిలో 12 నుంచి 16 మంది ఉంటున్నారు. చదువు, భోజనం వరండాలోనే. పరిసరాలు మొత్తం అపరిశుభ్రంగా ఉన్నాయి. వర్షం వస్తే వసతి గృహం ఎదుట మొత్తం నీరు నిలుస్తుంది. బాత్‌రూమ్‌లు ఉన్నా.. వాటి డోర్లు కిందిభాగం పాడయ్యాయి. స్నానాలకు మూడు రూములే ఉండటంతో ఆరుబయటే స్నానాలు, బట్టలు ఉతుక్కోవటం చేస్తుంటారు. నీటి వసతి సౌకర్యం భగిరథ నీరే దిక్కు. బోరు లేక పోవటంతో నల్లా నీటినే ట్యాంకుల్లో నిల్వ చేస్తున్నారు. నల్లా రాకపోతే ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించాల్సిన దుస్థితి. ఈ గృహంలో ముగ్గురు సిబ్బంది ఉన్నారు. వార్డెన్ కూడా లేకపోవటంతో శంకర్‌పల్లి హాస్టల్‌వార్డన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. అందాల్సిన దుస్తులు, దుప్పట్లు ఇంత వరకు అందలేవని విద్యార్థులు తెలిపారు.

పనిచేయని నీటిశుద్ధి యంత్రం

తలకొండపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో 45 మంది విద్యార్థులు చదవుతున్నారు. ఉదయం అల్పాహారం, రాత్రి గంటలు 6 నుంచి 7 గంటల ప్రాంతంలో ఆహారాన్ని అందిస్తున్నారు. చేతులు శుభ్రం చేసుకొని ఆహారం తీసుకుంటున్నామని విద్యార్థులు తెలిపారు. తాగునీటిని అందించే ఫిల్టర్ చెడిపోయిందని, బుక్స్, నోట్ బుక్స్, దుప్పట్లు పంపిణీ చేయలేదని చెప్పారు. ఫిల్టర్ చెడిపోయిన విషయం వాస్తవమేనని, తాగునీటిని క్యాన్ల ద్వారా విద్యార్థులకు అందజేస్తున్నామని హాస్టల్ సంక్షేమాధికారి శ్రీనువాసులు తెలిపారు. హాస్టల్‌కు ప్రహరీ సరిగా లేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తానని చెప్పారు.

కొత్త భవనం అయితే...

ఎస్సీ బాలుర వసతిగృహం పాత భవనం కావటంతో ఇబ్బందులు తలెత్తాయి. మరమ్మతులు చేయించాం. మరిన్ని సౌకర్యాలు, మరమ్మతుల కోసం ఇటీవల ఇంజినీరింగ్ అధికారులు సర్వేచేశారు. పక్కనే ఎస్‌డబ్లూఓ కార్యాలయాన్ని వాడుకునేందుకు అనుమతి వచ్చింది. అవసరమైతే వాడుకుంటాం. కొన్ని నెలలుగా డైట్‌బిల్లులు సక్రమంగా రాకపోవటంతో సమస్యలు అధికమయ్యాయి. గదులు సరిపోకపోవటంతో ఆఫీస్ గదిని విద్యార్థులకు కేటాయిస్తున్నాను. కొత్త భవనం ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుంది. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

– పాండు, ఇన్‌చార్జి వార్డెన్, చేవెళ్ల ఎస్సీ బాలుర వసతిగృహం

వెంటాడుతున్న దోమల బెడద


వసతి గృహం మరుగుదొడ్ల దుస్థితి

మంచాల: మండలంలోని ఆరుట్ల గ్రామం ఎస్సీ బాలుర వసతిగృహంలో మూడో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 100 మందికి 115 మంది ఉన్నారు. వారికి ఇప్పటి వరకు దుప్పట్లు, నోటు పుస్తకాలు అందలేదు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు అవుతున్నా రాత పుస్తకాలు అందక చదువుకోవడం ఇబ్బందిగా ఉందని విద్యార్థులు తెలిపారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని, వాటి తలుపులు ఊడిపోయని పేర్కొంటున్నారు. దోమలు బాగా పెరిగాయని, గదుల్లో ఫ్యాన్లు పనిచేయక ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు గదుల పై కప్పులు కురుస్తున్నాయని, తాగు నీటి సమస్య ఉందని వెల్లడించారు.

అన్నీ బాగున్నాయి


పరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు

షాబాద్: మండల కేంద్రంలో రెండు హాస్టళ్లు ఉన్నాయి. ఎస్సీ బాలుర హాస్టల్లో 110 మంది విద్యార్థులు ఉన్నారు. బీసీ హాస్టల్లో 85 మంది ఉన్నారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయి. మరుగుదొడ్లు, వంట గదులు, పడక గదులు శుభ్రంగా ఉంచారు. రెండు వసతి గృహాల్లో వాటర్ ఫిల్టర్లు ఉన్నాయి. విద్యార్థులు స్వచ్ఛమైన తాగునీటిని తాగుతున్నారు. మరుగుదొడ్ల శుభ్రంగా ఉన్నాయి. అన్ని సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయని, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారని విద్యార్థులు తెలిపారు.

పడకేసిన పారిశుద్ధ్యం


బీసీ వసతి గృహంలో విద్యార్థుల గది పక్కనే అపరిశుభ్రత

కొందుర్గు: మండల కేంద్రంలోని బాలుర వసతి గృహాల ఆవరణలో చెత్త చెదారం పేరుకుపోయి అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. దీంతో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. ఎస్సీ బాలుర వసతి గృహంలో 130 మంది ఉండగా.. సరిపడా మరుగదొడ్లు, మూత్రశాలలు లేవని విద్యార్థులు తెలిపారు. ఉన్న బాత్‌రూమ్‌లు శుభ్రం చేయకపోవడం వలన దుర్వాసన వస్తుందని చెప్పారు. బీసీ వసతి గృహంలో 100 మంది ఉన్నారు. కానీ సరిపడా బాత్‌రూమ్‌లు లేవు.

డైనింగ్ హాలు లేక..


డైనింగ్ హాలు లేక పోవడంతో హాస్టల్ ప్రాంగణంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

కడ్తాల్: గిరిజన సంక్షేమ వసతి గృహం, ఆశ్రమ పాఠశాలలో 324 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 400 మంది ఉన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారు. బాలుర వసతి గృహంలో ఒక గదికి పూర్తిగా తులపు లేదు. బెడ్‌షీట్‌ను పరదాగా కట్టారు. మరో గదికి ఊడిపోయిన డోరు దేలాడుతోంది. డైనింగ్ హాలు లేక పోవడంతో వసతిగృహ ఖాళీ ప్రదేశంలోనే విద్యార్థులు భోజనం చేస్తున్నారు. మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో తగినన్ని గదులు లేక పోవడంతో.. ఇరుకు గదుల్లోనే విద్యనభ్యసిస్తున్నారు.

గంజాయి సేవించిన యువకుల అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్: గంజాయి సేవించడంతో పాటు సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన శనివారం పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం .. దండుమైలారం గ్రామానికి చెందిన తాళ్లగూడెం స్వామి, ఉక్కుల రాజు అనే ఇద్దరు యువకులు గంజాయికి అలవాటు పడ్డారు. నిత్యం సేవించడమే కాకుండా ఇతరులకు సరఫరా చేస్తుండేవారు. ఈ క్రమంలో వారి వద్ద నుంచి 160 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.